అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



తాడేపల్లి అంజిరెడ్డి కాలనీలోని లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు

మంగళగిరి: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు చెప్పారు. నగరంలోని రాజీవ్ గృహకల్ప వద్ద నిర్మిస్తున్న చేనేత మగ్గం షెడ్లను బుధవారం వారు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 23 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే పలు తహసీల్దార్ కార్యాలయాలకు పట్టాలు చేరుకున్నట్లు వివరించారు. సీఆర్‌డీఏ పరిధిలో పేదల ఇళ్ల స్థలాల కోసం 550 ఎకరాలను సీఆర్‌డీఏ రెవెన్యూ విభాగానికి అప్పగించిందని పేర్కొన్నారు. సీఆర్‌డీఏ అప్పగించిన భూముల్లో జంగిల్ క్లియరెన్స్‌తో పాటు చదును చేసి లే అవుట్ సిద్ధం చేసే పనులు జరుగుతున్నాయని చెప్పారు. సీఆర్‌డీఏ భూముల్లో ఇళ్ల పట్టాలపై కొందరు కోర్టును ఆశ్రయించారని, కోర్టు తీర్పు మేరకు నిర్ణయం తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ యు.శారదాదేవి, తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, డీఈ కృష్ణారెడ్డి, ఏసీపీ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.4.50కోట్లు

నగరంలోని స్వర్గపురి (శ్మశాన వాటిక)ల్లో రూ.4.50 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నట్టు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చెప్పారు. బుధవారం నగరంలోని పాత మంగళగిరి హిందూ, శ్మశాన వాటికల్లో జరుగుతున్న గ్రావెల్ మెరక పనులను ఎమ్మెల్యే ఆర్కే ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, స్థానికులు పొట్లాబత్తుని లక్ష్మణరావు, శ్రీనివాసరావు, వ్యాసం అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంటల వ్యవధిలో సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే ఆర్కే శ్మశాన వాటికలను పరిశీలించిన సందర్భంగా స్థానిక మహిళలు నీటికి ఇబ్బంది పడుతున్నామని వివరించారు. దీంతో స్పందించిన ఆర్కే బోరు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించడంతో గంటల వ్యవధిలోనే అధికారులు బోరు వేయించారు. అలాగే యర్రబాలెం రైస్ మిల్ వీధిలో పర్యటించిన ఎమ్మెల్యే ఆర్కేకు స్థానికులు డ్రెయినేజీ సమస్య వివరించడంతో వెంటనే పైపులతో కల్వర్టు నిర్మించి నీటిపారుదలకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఫలితంగా అధికారులు కల్వర్టును నిర్మించి సమస్యలను పరిష్కరించారు.

రిజిస్ట్రేషన్ పట్టాల అందజేత

తాడేపల్లిరూరల్ : ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న వారికి నిబంధనల ప్రకారం పక్కా రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు అందిస్తామని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చెప్పారు. బుధవారం రాత్రి తాడేపల్లి అంజిరెడ్డి కాలనీలో ఉన్న 100 మందికి రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి ఎమ్మెల్యే ఆర్కే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మరో 200 మందికి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని, వారికీ అందిస్తామని వివరించారు. అలాగే గతంలో పట్టాలు లేని వారు 30 నుంచి 40 మంది ఇదే కాలనీలో నివసిస్తున్నారని తాడేపల్లి తహసీల్దార్ పరిశీలించి వారికి కూడా అందజేస్తారని వివరించారు. కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. స్థానిక మహిళలు చెప్పిన సమస్యలపై స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు కిషోర్, ప్రవీణ్, వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, జిల్లా యస్‌సి సెల్ కన్వీనర్ మేడా పండు, తాడేపల్లి యస్‌సి సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, మహిళా విభాగం కన్వీనర్ సంపూర్ణ పార్వతి, తాడేపల్లి యస్‌టి సెల్ కన్వీనర్ బాలసాని అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్చి పనుల పరిశీలన

కుంచనపల్లి ప్రాతూరు రహదారిలో జరుగుతున్న ఆర్చి నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సుమారు రూ.14 కోట్ల వ్యయంతో జాతీయ రహదారి ప్రాతూరు అండర్‌పాస్ నుంచి నూతక్కి వరకు బీటీ రోడ్ నిర్మాణాన్ని పూర్తిచేశామని, ఆ రహదారికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, వంగవీటి మోహనరంగా ముఖద్వారంగా నామకరణం చేయనున్నామని వెల్లడించారు. దీని కోసం రూ.40 లక్షలతో ఆర్చి నిర్మించినట్లు ఎమ్మెల్యే ఆర్కే వెల్లడించారు.

క్లుప్తంగా

రూ.38లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి జామాయిల్ తోటలో కార్పొరేషన్ అధికారులు రూ.38 లక్షలతో సీసీ రోడ్ నిర్మాణ పనులను బుధవారం చేపట్టారు. జామాయిల్‌తోటలోని గోపిరెడ్డి ఇంటి వద్ద నుంచి 461 మీటర్ల పొడవున 3 మీటర్ల వెడల్పున పనులు చేపట్టామని ఏఈ కిషోర్ తెలిపారు. ఎమ్మెల్యే ఆర్కే ఈ ప్రాంతంలో పర్యటించిన సందర్భంలో కాలనీ వాసులు సీసీ రోడ్ నిర్మాణం చేపట్టాలని అడగడంతో, ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగిస్తే రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. స్థానికులు తొలగించేందుకు అధికారులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రోడ్డు నిర్మాణ పనులు చకచకా చేపట్టారు.

నేడు విఘ్నేశ్వరుడి ఆలయ వార్షికోత్సవం



ఫిరంగిపురం: మండలంలోని అల్లంవారిపాలెం గ్రామంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయ సప్తమ వార్షికోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. స్వామికి అర్చకులు ఆంజనేయశర్మ, రాజేంద్రశర్మ పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహిస్తామని, సాయంత్రం స్వామి ఉత్సవమూర్తులను అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

నీటి తీరువాను చెల్లించండి

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలో ఉన్న 18 గ్రామాల్లో భూమి కలిగిన రైతులు నీటితీరువా పన్నులను వెంటనే చెల్లించాలని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. రైతులు సమీపంలోని సచివాలయాల్లో గానీ, లేదా భూమి ఉన్న ప్రాంతంలోని సచివాలయాల్లో గానీ వెంటనే నీటి తీరువా, ఇతర పన్నులను చెల్లించాలని కోరారు.

'బీజేపీని గద్దె దింపుదాం'

మంగళగిరి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు తమ పోరాటం ఆగదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక నిరంకుశ విధానాలపై కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో ప్రచార భేరీ విజయవంతంగా జరుగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జంగాల అజయ్‌కుమార్, చిన్ని తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

1న యథావిధిగా పెన్షన్ల పంపిణీ

మంగళగిరి: రాజధాని ప్రాంతంలో భూమి లేని పేదలకు పంపిణీ చేసే సామాజిక పింఛన్లను మే 1న యథావిధిగా పంపిణీ చేయనున్నట్టు సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చికి సంబంధించి పింఛన్ల డేటా ఇంటిగ్రేషన్‌లో తలెత్తిన సాంకేతిక లోపాల వల్ల పంపిణీకి స్వల్ప అంతరాయం కలిగిందని, అయినప్పటికీ సామాజిక భద్రతా పింఛన్ల నిధి నుంచి 7,478 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశామని, సాంకేతిక లోపంతో పింఛను అందుకోలేక పోయిన లబ్ధిదారులకు ఏప్రిల్‌నెల పింఛనుతోపాటు మార్చి నెల పింఛను కూడా కలిపి మే 1న వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తామని వివరించారు.

ఇంటర్‌లో వీజే విద్యార్థుల ప్రతిభ

మంగళగిరి: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో వీజే కళాశాల విద్యార్థిని ప్రవల్లిక 986(ఎంపీసీ) మార్కులు సాధించింది. ఈ మేరకు కరస్పాండెంట్ పి.రాజశేఖర్ ఓ ప్రకటన విడుదల చేశారు. బైపీసీలో కె ఏకలవ్యశ్రీ 964 మార్కులు, ఎంఈసీలో ఎస్‌కె నబీషా బేగం 960, సీఈసీలో పి.శ్యామల 947 మార్కులు సాధించినట్టు వివరించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో జి.సాయిబాలాజి 460, బైపీసీలో ఎస్‌కే హసీదా 421, ఎంఈసీలో ఏ జస్విత 782, సీఈసీలో పి.నేహశ్రీ 433 మార్కులు సాధించినట్టు వెల్లడించారు.

యాపిల్ విద్యార్థుల ప్రతిభ

మేడికొండూరు: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో పేరచర్ల యాపిల్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపల్ ఎం. అజయ్‌కుమార్ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో కె.చందన ప్రియ 465, బి యశ్విని 463, యస్‌కే కరీష్మా 461, కె. రిషిత 459, ఎస్.అప్సర 458 మార్కులు సాధించారని వివరించారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ ఇమ్మడి రవికుమార్ అభినందించారు.

జగనన్న పాలనలో అన్నివర్గాల సంతృప్తి



లాం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి



నవులూరు మక్కేవారిపేటలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి

లాం(తాడికొండ)/మంగళగిరి: జగనన్న పాలనలో అన్ని వర్గాలు నూరుశాతం సంతృప్తిగా ఉన్నారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం తాడికొండ మండలం లాం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆయన పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 75 ఏళ్ల భారతదేశ చరిత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్దపీట వేస్తూ ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం అమలు చేసిన ముఖ్యమంత్రి ఏ రాష్ట్రంలో లేరన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వినర్ తాళ్ళ శ్రీనివాసరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, సచివాలయ కన్వినర్ శ్రీనివాస్ రెడ్డి, కొండా నవీన్ రెడ్డి, స్థానిక నాయకులు షేక్ సాదిక్, అయూబ్, నూర్జహాన్, రావూరి నరేష్, గృహ సారథులు కుర్రా బంగారయ్య, పప్పు లలిత ప్రియ, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

– మంగళగిరిలోని వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. నవులూరు మక్కేవారి పేటలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పాటిబండ్ల కుమారి, వార్డు కన్వీనర్లు వేమూరి వందనం, ఐజాక్, పులి రామారావు, పాటిబండ్ల రాంబాబు, ఈపూరి ఆదామ్, బేతపూడి మహేష్, మోషేలతోపాటు వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

యర్రబాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా రమేష్‌బాబు



మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా రమేష్‌బాబును నియమించారు. ఈమేరకు డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి రత్నావతి ఉత్తర్వులు జారీ చేశారు. పీఏసీఎస్ డైరెక్టర్లుగా ఈపూరి ప్రకాశరావు (కృష్ణాయపాలెం), క్రోసూరి ఏడుకొండలు (యర్రబాలెం)ను నియమించారు. బుధవారం పీఏసీఎస్‌లో జరిగిన కార్యక్రమంలో చైర్మన్‌గా రమేష్ బాబుతోపాటు డైరెక్టర్లు ప్రకాశరావు, ఏడుకొండలు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి నవీన్, వైఎస్సార్ సీపీ నాయకులు గుండాల శ్రీనివాసరావు, కాపరౌతు భాస్కరరావు, రేమిణిశెట్టి గోపి తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్‌కు అడ్డంగా టీడీపీ ఫ్లెక్సీ



తాడేపల్లిరూరల్: టీడీపీ నేతలు బస్ షెల్టర్‌కు అడ్డంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీని ఇప్పటి వరకు తొలగించలేదు. దీంతో ప్రయాణికులు షెల్టర్ లోపలకు వెళ్లే వీలులేక అవస్థలు పడుతున్నారు. బస్సుల కోసం ఎండలో రోడ్డుపైనే నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫ్లెక్సీని కార్పొరేషన్ సిబ్బంది కూడా తొలగించే ప్రయత్నం చేయడం లేదు. వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సర్పంచ్‌పై హత్యాయత్నం

పిడపర్రు (కొల్లిపర): వ్యక్తిగత కక్షల నేపథ్యంలో సర్పంచ్‌పై హత్యాయత్నం జరిగిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. కొల్లిపర ఆర్.రవీంద్రరెడ్డి కథనం మేరకు పిడపర్రు గ్రామ సర్పంచ్ దూరు రత్నబాబుపై అదే గ్రామానికి చెందిన జోసఫ్ అతని కుమారులు వ్యక్తిగత కక్షల నేపథ్యంలో మారణాయుధాలతో దాడి చేశారు. క్షతగాత్రుడిని కుటుంబసభ్యులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తెనాలిలోని ఒక ప్రైవేటు హాస్పటల్‌కు తీసుకువెళ్లారు.

సంక్షేమ పథకాలతో గడప గడపకు లబ్ధి

వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



సంక్షేమ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

ఫిరంగిపురం: సంక్షేమ పథకాల ద్వారా గడప గడపకు లబ్ధి చేకూర్చినట్టు వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ చెప్పారు. మండలంలోని పొనుగుపాడు బీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం సురేష్‌కుమార్ నిర్వహించారు. జెడ్పీ పాఠశాల వద్ద నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ కాలనీ వాసులు కోరడంతో స్పందించిన సురేష్‌కుమార్ అర్హులందరికీ ఇళ్లస్థలం అందించేలా కృషి చేస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను గృహాలకు అతికించారు. పోలేరమ్మ గుడి సెంటర్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరడంతో వాటిని త్వరలో ఏర్పాటు చేయిస్తానని సురేష్ కుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.మధుసూదన్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మయ్య, సీహెచ్ రామచంద్రం, పి.మరియబాబు, ఎస్.నాగరాజు, గేరా కోటేశ్వరరావు, ఎం.జోజిబాబు, ఎం.జయపాల్, ఎం.కొండలు, కె.వీరయ్య, బాజి, బి.నాగరాజు, జాకీర్,వెంకటేశ్వరరెడ్డి, పి.వెంకట్రావు, గృహసారథులు, సిబ్బంది, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో కేఎల్‌యూ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కేఎల్‌యూ డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు తదితరులు

తాడేపల్లిరూరల్ : పదో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్‌చాంపియన్ షిప్ 2023 పోటీల్లో తమ విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కేఎల్‌యూ విద్యార్థి సంక్షేమ విభాగ అధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు బుధవారం చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఈనెల 22, 23 తేదీల్లో జరిగిన పదో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ 2023 పోటీల్లో తమ విశ్వవిద్యాలయంలో బీ ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బిట్టు కుమార్, బీఎస్సీ అగ్రికల్చర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.వి.అశ్విన్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్నారని చెప్పారు. బి ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చందన్‌కుమార్, ట్రిపుల్ ఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చంద్రశేఖర్, ఫార్మాడీ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.కౌబాయ్ ద్వితీయ స్థానాల్లో నిలిచి రజత పతకాలను సాధించారని వివరించారు. విద్యార్థులను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె. హరికిషోర్, డాక్టర్ కె.సుజాత, వ్యాయామ అధ్యాపకులు అభినందించారు.

సుందరం.. సుమనోహరం



బోటుయార్డు రోడ్డులో అందమైన రంగులు, చిత్రాలతో తీర్చిదిద్దిన ప్రహరీ



రైల్వేబ్రిడ్జి ప్రాంతంలో నాటిన మొక్కలు

తాడేపల్లిరూరల్ : సీఆర్డీఏ ఆధ్వర్యంలో తాడేపల్లి బోటు యార్డు రోడ్డును సుందరంగా తీర్చిదిద్దారు. బుధవారం రోడ్డు వెంబడి పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ ఆదేశాల మేరకు మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ శారదాదేవి ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. బోటు యార్డ ప్రాంతంలో ఉన్న ప్రహరీలకు రంగులు వేసి, అందమైన పెయింటింగ్‌లతో తీర్చిదిద్దారు. రహదారికి ఇరువైపులా చక్కని మొక్కలు నాటడమే కాకుండా వాటి చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు.

'పట్టా'భిషేకానికి సిద్ధం



పట్టాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ వేగం పుంజుకుంది. అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలం అందజేసి సొంతింటి కల నెరవేర్చాలనే ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకం ఈ కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళగిరి నియోజకవర్గంలో సుమారు 23వేల మంది లబ్ధిదారులను అధికారులు గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. ఆ మేరకు ప్రభుత్వం ఇళ్ల స్థలాల పట్టాలను వారి వారి పేర్లు, వివరాలతో ముద్రించి తహసీల్దార్ కార్యాలయాలకు పంపింది. మంగళవారం మంగళగిరి, తాడేపల్లి , దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయాలకు పట్టాలు చేరుకున్నాయి. ఈ పట్టాలను బుధవారం రెవెన్యూ అధికారులు పరిశీలించి ఆయా ప్రాంతాల వారీగా లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. - మంగళగిరి

లింకు రోడ్డు నిర్మాణం



తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న మరో లింక్‌రోడ్ నిర్మాణాన్ని ఎంటీఎంసీ అధికారులు బుధవారం చేపట్టారు. ఉండవల్లి పోలకమ్మతల్లి దేవస్థానం నుంచి పలు రోడ్లను కలుపుతూ జామాయిల్ తోట వరకు రోడ్డు ఉంది. ఇప్పటి వరకు ఆ రోడ్డు నిర్మాణ పనులు ఎవరూ చేపట్టలేదు. స్థానికులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్లడంతో నెల రోజుల వ్యవధిలో గ్రావెల్ రోడ్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల పాతజాతీయరహదారికి, జాయిల్‌తోట రోడ్డుకు లింక్ రోడ్డుగా ఉందని ఏఈ కిషోర్ తెలిపారు.

వైభవంగా లూథరన్ చర్చి వార్షిక ప్రతిష్ఠా ఉత్సవం



చర్చిలో ఫాదర్ ఆశీస్సులు పొందుతున్న కత్తెర సురేష్ కుమార్

పొన్నెకల్లు(తాడికొండ): తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలోని పరిశుద్ధ త్రిత్వ లూథరన్ చర్చి ద్వితీయ వార్షిక ప్రతిష్టా మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఫాదర్ ఆశీస్సులు అందుకున్నారు.

సురేష్‌కుమార్‌ను సత్కరించిన ముస్లిం మతపెద్దలు

రాయపూడి ఈద్గా సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళడం హర్షణీయమని తుళ్ళూరు మండలం రాయపూడి గ్రామ ముస్లిం మతపెద్దలు, పలువురు నాయకులు కొనియాడారు. రాయపూడిలో ఈద్గా లేక రోడ్లపై ప్రార్థనలు నిర్వహించే పరిస్థితి ఉన్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్ళగా ఆయన సీఎంను కలిసి ఈద్గా స్థల కేటాయింపు దిశగా చొరవ తీసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. దీంతో ముస్లింలు బుధవారం సురేష్‌కుమార్‌ను శాలువాతో సత్కరించారు.